సాక్షి
సూర్యాపేట
సోమవారం । 9 । జూన్ । 2025



కమ్యూనిస్టులపై కేంద్రం కుట్ర

కమ్యూనిస్టులను లేకుండా చేయాలని కేంద్రం కుట్రలు పన్నుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు అన్నారు. - 8లో



బస్సుల కొరత..

యాదగిరికొండపైకి సరిపడా బస్సులు నడవకపోవడంతో భక్తులు గంటల తరబడి నిరీక్షిస్తూ అవస్థ పడుతున్నారు. - 8లో



ఏకపక్షంగా కట్టబెట్టారు!

ఎన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా కోదాడ పబ్లిక్ క్లబ్ నూతన భవనాన్ని వేలందారుడికి ఏకపక్షంగా కట్టబెట్టారు. - 10లో

న్యూస్‌రీల్

నేడు సూర్యాపేటకు డిప్యూటీ సీఎం రాక

భానుపురి (సూర్యాపేట) : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం సూర్యాపేటలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12గంటలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సూర్యాపేటలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించనున్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

భానుపురి(సూర్యాపేట) : పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురికి మంజూరైన రూ.2.20 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం ఆయన సూర్యాపేట పట్టణంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తండావాసుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కొత్తపల్లి శివ

సూర్యాపేట : మున్సిపాలిటీ పరిధిలోని కుసుమవారి గూడెం, 8వ వార్డు నల్ల చెరువు తండా వాసుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో తండాను సందర్శించి మాట్లాడారు. తండావాసులకు వారంలో ఒక రోజే మంచినీళ్లు వస్తున్నాయని, వచ్చిన రోజు కూడా అంతా మురుగునీరే వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పైపుల లీకేజీ, డ్రెయినేజీ వ్యవస్థ దుర్భరంగా ఉండడం మూలాన ఈ పరిస్థితి దాపురించిందని ఆయన విమర్శించారు. మిషన్ భగీరథ నీరు రాకుండా ఆపేశారని, వారానికి ఒక రోజు వచ్చే నీటితో స్నానం చేస్తే మొత్తం చర్మవ్యాధులు వస్తున్నాయని, దీంతో గ్రామస్తులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్ కుమార్, ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పేర్ల నాగయ్య, తండావాసులు సైదులు, నగేష్, రామకోటి తదితరులు పాల్గొన్నారు.

'మృగశిర' సందడి





మృగశిర కార్తె ప్రారంభం రోజును పురస్కరించుకుని ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో చేపలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు, భారీ చేపతో కొనుగోలుదారుడు - తాళ్లగడ్డ (సూర్యాపేట)

మొక్కల పెంపకంతో ఉపాధి

- మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని నిర్ణయం
- ఉమెన్ ఫర్ ట్రీస్ పథకం అమలుకు ప్రభుత్వం శ్రీకారం
- పట్టణాల సుందరీకరణలో మహిళలకు భాగస్వామ్యం కల్పించేలా కార్యక్రమం
- ఐదు మున్సిపాలిటీల్లో ఆరు మహిళా గ్రూప్‌ల ఎంపిక
- ఎనిమిది వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్న యంత్రాంగం



హుజూర్‌నగర్ పట్టణంలో ఉమెన్ ఫర్ ట్రీస్ పథకం కింద ఇటీవల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, అధికారులు

తాళ్లగడ్డ (సూర్యాపేట): మహిళల ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాయి. దీంట్లో భాంగంగా అమృత్–2.0 కార్యక్రమం ద్వారా మున్సిపాలిటీల సుందరీకరణకు ఉమెన్ ఫర్ ట్రీస్ పథకం అమలుకు శ్రీకారం చుట్టాయి. దీనికింద మున్సిపాలిటీల్లో మొక్కల పెంపకంతో ఉపాధి కల్పిస్తూ స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేయాలని నిర్ణయించాయి. మొక్కలు నాటి పెంచే బాధ్యతను ఆయా మున్సిపల్ అధికారులు మహిళా సంఘాల సభ్యులకు అప్పగించారు.

ఐదు మున్సిపాలిటీల్లో అమలుకు..

జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీలలో ఈ పథకం అమలుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఉమెన్ ఫర్ ట్రీస్ పథకంలో భాగంగా మొక్కలు పెంచడానికి ఆసక్తి ఉన్న మహిళా గ్రూపులను మెప్మా అధికారులు గుర్తించి ఎంపిక చేశారు. ప్రస్తుతానికి జిల్లాలోని సూర్యాపేట మున్సిపాలిటీ నుంచి రెండు, మిగతా మున్సిపాలిటీల నుంచి ఒక్కో గ్రూపు చొప్పున ఎంపిక చేశారు.

రూ.50.66 లక్షల అంచనా వ్యయం

జిల్లాలో ఐదు మున్సిపాలిటీల్లో మొత్తం 5,698 మహిళా సంఘాలు, 56,980 మంది సభ్యులు ఉన్నారు. ఐదు మున్సిపాలిటీల్లో ఆరు సంఘాలను ఎంపిక చేసి మొత్తం 8 వేల మొక్కలు నాటాలనే లక్ష్యంతో అనువైన ప్రదేశాలను గుర్తించారు. మొక్కల కొనుగోలు, గుంటల తవ్వకం, మహిళలకు కావాల్సిన కిట్లు (చీర, టోపీ, గూడ సంచి, పెన్ను, పుస్తకం, వాటర్ బాటిల్) వేతనాలు మొదలగు వాటికి అయ్యే ఖర్చులను అంచనా వేసి రూ.50.66 లక్షల నిధులు అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇందులో భాగంగా ఆరు సంఘాలను అమృత్ మిత్రలుగు ఎంపిక చేశారు.



సూర్యాపేటలో మొక్క నాటేందుకు ఏర్పాట్లుచేస్తున్న మహిళలు (ఫైల్)

5న కార్యక్రమం ప్రారంభం

ఈ పథకంలో మహిళా సంఘాల సభ్యులు ఈ నెల 5వ తేదీన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. 200 మొక్కలను ఒక సభ్యురాలు సంరక్షించేలా చర్యలు చేపడుతున్నారు. మొక్కలు నాటిన రోజు నుంచి రెండేళ్ల పాటు పూర్తి బాధ్యత వారిదే. ఈ క్రమంలో రెండేళ్ల పాటు అయ్యే ఖర్చులను ప్రభుత్వం మహిళా సభ్యులకు అమృత్–2.0 కింద ఇవ్వనుంది. దీనికోసం రోజూ కొంత సమయాన్ని కేటాయించి మొక్కలకు నీళ్లు పోయడం, వాలిపోకుండా కర్రలు పాతడంచేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఇచ్చే నిధులను మొక్కల కొనుగోలు, గుంటల తవ్వకాల కోసం ఖర్చు చేయగా మిగిలిన నిధులను సంఘాల సభ్యులకు వేతనాల కింద చెల్లిస్తారు.

మున్సిపాలిల్లో నాటాల్సిన మొక్కలు

మున్సిపాలిటీ	మహిళా సంఘాలు	లక్ష్యం	నాటినవి	అంచనావ్యయం (రూ.లక్షల్లో..)
సూర్యాపేట	2,619	1000	100	15.36
కోదాడ	1,464	1000	--	9.90
హుజూర్‌నగర్	786	2000	107	9.90
నేరేడుచర్ల	412	2000	200	7.50
తిరుమలగిరి	417	2000	--	8.00

లక్ష్యం నెరవేరేలా కృషిచేస్తాం..



మొక్కలు నాటి సంరక్షినందుకు వేతనాలు చెల్లిస్తామనడం మాకు ఆర్థిక చేయూతగా ఉంటుంది. మొక్కల పెంపకాన్ని విధిగా నిర్వహించి ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా కృషి చేస్తాం. మహిళా సాధికారతకు ఉపయోగపడే పథవకాలు రూపొందించడం సంతోషకరం.

– ఎస్‌కె.తారాబాయి, ఏసుసంఘం సభ్యురాలు, హుజూర్‌నగర్ మున్సిపాలిటీ

ఉపాధి కల్పించడం ఆనందంగా ఉంది



మొక్కల పెంపకం ద్వారా ఉపాధి కల్పించడం ఆనందంగా ఉంది. పట్టణంలోని నల్ల చెరువు వద్ద ఇప్పటికే 50 మొక్కల వరకు నాటాం. ప్రతిరోజూ వెళ్లి నీరు పోసి వస్తున్నాం. కచ్చితంగా మొక్కలను బతికించాల్సిన బాధ్యతను తూచ తప్పకుండా నిర్వర్తిస్తాం.

– మైనంపాటి అరుణ, మహేశ్వరి గ్రూపు, సూర్యాపేట మున్సిపాలిటీ

ఆశ.. నిరాశేనా!

మంత్రివర్గ విస్తరణలో జిల్లాకు మొండిచేయి

- జిల్లా నుంచి మంత్రి పదవి ఆశించిన ఇద్దరు ఎమ్మెల్యేలు
- మొదటి నుంచి మంత్రి పదవి వస్తుందనుకున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
- లంబాడా కోటాలో మంత్రి పదవి అడిగిన బాలునాయక్
- వీరిద్దరికీ పదవులు ఇవ్వని కాంగ్రెస్ అధిష్టానం
- మరోసారి విస్తరణలోనైనా అవకాశం దక్కేనా?





సాక్షి ప్రతినిధి, నల్లగొండ : రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో జిల్లాకు నిరాశే మిగిలింది. మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని అందులో జిల్లా నేతలు ఇద్దరికి చోటు దక్కుతుందని కొంతకాలంగా పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. అధిష్టానం కూడా ఆ దిశగా ఆలోచన చేయడంతో జిల్లాకు పక్కా మంత్రి పదవి దక్కుతుందని అంతా భావించారు. కానీ ఆదివారం ప్రకటించిన మంత్రివర్గంలో జిల్లా నేతలకు చోటు దక్కకపోవడంతో ఆశ నిరాశగానే మిగిలిపోయింది. అయితే మంత్రివర్గంలో మరో మూడు స్థానాలు ఖాళీగా ఉన్న నేపథ్యంలో మరోసారి జరిగే మంత్రివర్గ విస్తరణలోనైనా? అవకాశం దక్కుతుందా? ముఖ్యంగా ఎప్పటినుంచో మంత్రి పదవి ఆశిస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి అవకాశం ఇస్తారా? అన్న దానిపై జిల్లాలో జోరుగా చర్చసాగుతోంది.

రాజగోపాల్‌రెడ్డికి మంత్రి వర్గంలో దక్కని చోటు

ఈసారి మంత్రి వర్గ విస్తరణలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి చోటు దక్కలేదు. ఎన్నికల సమయంలో మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చినందునే ఆయన బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారన్న చర్చ జరిగింది. అయితే మొదటి మంత్రివర్గంలో రాజగోపాల్‌రెడ్డి సోదరుడైన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి చోటు దక్కడంతో ఒకే కుటుంబం నుంచి ఇద్దరికి మంత్రి పదవి ఇచ్చేందుకు అధిష్టానం మొగ్గు చూపకపోవడంతో రాజగోపాల్‌రెడ్డికి అప్పట్లో చోటు దక్కలేదు. ఇక పార్లమెంట్ ఎన్నికల సమయంలో అధిష్టానం రాజగోపాల్‌రెడ్డితో మాట్లాడి భువనగిరి ఎంపీ గెలుపు బాధ్యతను ఆయనకు అప్పగించింది. ఎంపీ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆయన అన్నీ తానై ఆ బాధ్యతను భుజాన వేసుకుని భువనగిరి పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించారు. దీంతో రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఖాయమని కాంగ్రెస్ వర్గాలతో పాటు జిల్లా అంతటా జోరుగా ప్రచారం సాగింది.

వాయిదా పడుతూ విస్తరణ..

పార్లమెంట్ ఎన్నికల నాటినుంచి మంత్రివర్గ విస్తరణ వాయిదా పడుతూ వచ్చింది. ఎప్పుడు మంత్రివర్గ విస్తరణ వార్తలు వెలువడినా.. రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఖాయమని ఆయన అనుచరులు నమ్మకంతో ఉన్నారు. ఆదివారం జరిగిన మంత్రివర్గ విస్తరణలో రాజగోపాల్‌రెడ్డికి నిరాశ ఎదురైంది. దీంతో ఆయన అలకవహించినట్లు చర్చ జరగడంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆయనను బుజ్జగించేందుకు ప్రయత్నించినా ఆదివారం రాత్రి వరకు వారికి అందుబాటులోకి రాలేదు.

చర్చనీయాంశంగా మారిన జానారెడ్డి లేఖ

రెండు నెలల కిందట మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని విస్తృత ప్రచారం జరిగింది. అదే సమయంలో రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాలని మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నాయకుడు జానారెడ్డి అధిష్టానానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. దాంతో రాజగోపాల్‌రెడ్డి ఒకింత ఆగ్రహానికి గురయ్యారు. కొన్నాళ్ల తరువాత ఆ చర్చ సద్దుమణిగినా ప్రస్తుతం విస్తరణలో రాజగోపాల్‌రెడ్డికి, బాలునాయక్‌కు పదవులు దక్కలేదు.

బాలునాయక్‌కు డిప్యూటీ స్పీకర్ ఇస్తారని మొన్నటి వరకు చర్చ

మరోవైపు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ లంబాడా కోటాలో మంత్రి పదవిని ఇవ్వాలని గతంలోనే అధిష్టానాన్ని అడిగారు. ఆ దిశగా అధిష్టానం కూడా మొగ్గు చూపినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. జిల్లాకు ఇప్పటికే ఇద్దరు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నందున, మరో రెండు మంత్రి పదవులు ఇస్తే ఇతర సమస్యలు వస్తాయన్న ఆలోచనతో రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చి, బాలునాయక్‌కు డిప్యూటీ స్పీకర్ ఇస్తారని అసెంబ్లీ సమావేశాల సమయంలో జోరుగా చర్చ సాగిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం ఇద్దరిలో ఏ ఒక్కరికి కూడా బెర్తు దక్కలేదు.

తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి

- మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు



చిన్నారులతో కలిసి ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న వేనేపల్లి పాండురంగారావు

మిర్యాలగూడ : తెలంగాణలో సైనిక్ పాఠశాల ఏర్పాటు చేయాలని మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు అన్నారు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటాలు, వందలాది మంది అమరుల త్యాగాల ఫలితంగా సిద్ధించిన తెలంగాణలో సైనిక్ పాఠశాల ఏర్పాటు చేయకపోవడాన్ని ఖండిస్తూ ఆదివారం ఆయన మిర్యాలగూడ పట్టణంలో చిన్నారులతో కలిసి ఫ్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణను ముందుకు తీసుకెళ్లేది, అభివృద్ధి పథంలో నిలబెట్టేది విద్యయేనన్నారు. తెలంగాణలో సైనిక్ పాఠశాల ఏర్పాటుకు కృషి చేయాలని ఆయన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న కోరుకొండ సైనిక్ పాఠశాల కాకుండా మరో మూడు కేటాయించారని కానీ.. తెలంగాణకు ఒక్కటి కూడా కేటాయించకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

సెక్యులర్ వాదులతో దేశానికి ముప్పు



శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, నాయకులు

రామగిరి(నల్లగొండ) : సెక్యులర్ వాదులతో దేశానికి ముప్పు పొంచి ఉందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలో ఆదివారం నిర్వహించిన శివాజీ పట్టాభిషేక మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందూ మతం.. ధర్మంపై నడుస్తుందన్నారు. అనంతరం శోభాయాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి, హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి రాంబాబు, నరేందర్, దీపక్, గోలి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురిపించి.. ముఖం చాటేసి..!

- పది రోజులుగా కరుణించని వరుణుడు
- తొలకరి వర్షాలకు లక్ష ఎకరాల్లో వివిధ పంటల సాగు
- ఎండలకు భూమిలోనే మాడిపోతున్న విత్తనాలు
- చినుకు జాడ లేక ఆందోళనలో రైతులు



నాగారం మండలం పస్తాలలో పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు (ఫైల్)

నాగారం : ఈసారి రోహిణి కార్తెకు ముందే రుతుపవనాలు పలకరించాయి. దీంతో తొలకరి వర్షాలు నమోదు కావడంతో జిల్లాలోని రైతులు ముందస్తుగానే వేలాది ఎకరాల్లో పత్తితోపాటు వివిధ రకాల పంటలకు సంబంధించి లక్షకుపైగా ఎకరాల్లో విత్తనాలు నాటారు. కానీ పది రోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతోపాటు ఎండలు మండుతుండడంతో వేసిన విత్తనాలు భూమిలో మాడిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మొలక రావడం లేదు..

మే నెల మూడో వారంలో వర్షాలు కురవడంతో జిల్లా వ్యాప్తంగా రైతులు పత్తి, వేరుశనగ, కందులు, మొక్కజొన్న తదితర విత్తనాలు నాటారు. సాధారణంగా నాటిన వారం రోజులకు విత్తనం మొలకెత్తాలి. పది రోజులుగా మేఘాలు దోబూచులాడుతున్నాయే తప్ప వాన కురవడం లేదు. దీంతో భూమిలో వేసిన విత్తనం మొలకెత్తడం లేదు. సాధారణంగా వర్షాకాలం సాగు మృగశిర కార్తె అనంతరం మొదలవుతుంది. మృగశిర కార్తె రాకతో వాతావరణం చల్లబడుతుంది. ఆ వాతావరణంలో విత్తనం పడితే దిగుబడి బాగా వస్తుంది. కానీ ప్రస్తుత పరిస్థితులు దానికి భిన్నంగా ఉన్నాయి. పది రోజులుగా ఎండలు దంచి కొడుతున్నాయి. పంట దిగుబడి రావాలంటే విత్తన దశలో వాతావరణం అనుకూలించాలి. గడిచిన వారం రోజుల్లో కనీసం ఒక్క వాన కురవలేదని రైతులు అంటున్నారు.

పంట ప్రణాళిక ఇలా..

ఈ ఏడాది వర్షాలు ముందస్తుగా రావడంతో వ్యవసాయాధికారులు ఇప్పటికే వానాకాలం పంట ప్రణాళిక తయారు చేశారు. జిల్లాలోని 486 గ్రామ పంచాయతీల పరిధిలో సాగు విస్తీర్ణం 6.17లక్షలు ఉండగా దీనిలో 4.85లక్షల ఎకరాల్లో వరి, 91వేల ఎకరాల్లో పత్తి, 0.41 ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేయనున్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. దీనికి తగ్గట్టుగా ఎరువుల ప్రణాళిక కూడా సిద్ధం చేశారు. ముందస్తు వర్షాల ప్రభావం కారణంగా జిల్లాలో ఇప్పటికే సమారు లక్ష ఎకరాలకుపైగా వివిధ రకాల విత్తనాలు విత్తారు. మృగశిర కార్తె కూడా రావడంతో ఇప్పుడైనా వర్షాలు కురుస్తాయా లేదా అని అన్నదాత దిగులు చెందుతున్నాడు. మరో వారం రోజుల్లో విత్తనాలు మొలకెత్తితేనే ప్రయోజనం ఉంటుంది. లేకపోతే రెండోసారి విత్తనాలు నాటాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగు అంచనా ఇలా..

పంట	ఎకరాల్లో
వరి	4,85,125
పత్తి	91,000
మొక్కజొన్న	45
కంది	2,650
పెసర	2,700
వేరుశనగ	400
చెరుకు	60
మిర్చి	15,150
ఆయిల్‌పాం	4,000
ఇతర పంటలు	150
పండ్లు, కూరగాయలు	16,200
మొత్తం	6,17,480

నృసింహుడి సన్నిధిలో కోలాహలం



శ్రీస్వామి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

యాదగిరిగుట్ట: ఓవైపు నిత్యారాధనలు, మరో వైపు భారీగా తరలివచ్చిన భక్తులతో ఆదివారం యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో కోలాహలం నెలకొంది. వేకువజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ, అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చకులు తులసీదళ అర్చన చేశారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజ వాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆయా వేడుకల్లో భక్తులు భారీగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


భాస్కర్ (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి): టాటా ఏస్ వాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన తిరుమలగిరి మండల కేంద్రంలో శనివారం రాత్రి జరిగింది. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండలం ఖోక్యానాయక్ తండాకు చెందిన గుగులోతు భాస్కర్ శనివారం రాత్రి సూర్యాపేట రోడ్డు నుంచి వస్తున్న టాటా ఏస్ వాహనంలో ఎక్కి వెనుక కూర్చున్నాడు. తిరుమలగిరి మండల కేంద్రంలోని ఫాతిమా స్కూల్ వద్దకు రాగానే టాటా ఏస్ వాహనాన్ని వెనుక లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భాస్కర్ వాహనం నుంచి ఎగిరి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని భాస్కర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఉమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బాత్రూంలో జారిపడి..

చౌటుప్పల్: బాత్రూంలో జారిపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం సాయంత్రం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో చోటుచేసుకుంది. ఆదివారం సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని చిన్నకొండూర్ రోడ్డులో మార్కండేయనగర్‌లో నివాసముంటున్న సయ్యద్ అబ్దుల్ రెహమాన్ (43) ఆర్టీఏ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బక్రీద్ పండుగకు అతడి భార్య సల్మా యాస్మిన్ హైదరాబాద్‌లో ఉంటున్న తన తల్లిగారింటికి వెళ్లింది. ఇంట్లో రెహమాన్ ఒక్కడే ఉన్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం బాత్రూంకు వెళ్లిన రెహమాన్ ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందాడు. సమీపంలోనే ఉంటున్న బంధువులు గమనించి రెహమాన్ భార్య, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని మహిళ మృతి

మిర్యాలగూడ టౌన్: రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని మహిళ మృతిచెందింది. ఈ ఘటన శనివారం రాత్రి మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామ శివారులో జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని షాబునగర్‌కు చెందిన పొట్లూరి అలివేలు(35) తన తల్లి బొజ్జ యశోదతో కలిసి పని నిమిత్తం శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరుకు వెళ్లింది. తిరిగి లారీలో గుంటూరు నుంచి మిర్యాలగూడకు వస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి 10గంటల సమయంలో మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామ శివారులో డ్రైవర్ లారీని ఆపి బహిర్భూమికి వెళ్లాడు. అలివేలు, యశోద కూడా లారీ దిగి మూత్రవిసర్జనకు వెళ్లి తిరిగి లారీ వద్దకు వచ్చేందుకు నార్కట్‌పల్లి–అద్దంకి రహదారి దాటుతుండగా.. గుంటూరు నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న కారు అలివేలును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అలివేలు అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి తల్లి యశోద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సుల కొరత.. భక్తుల అవస్థ


కొండపైన బస్సులో ఎక్కడానికి పోటీ పడుతున్న భక్తులు


ప్రసాద విక్రయశాలలో బారులుదీరిన భక్తులు

- యాదగిరిగుట్టలో భక్తుల రద్దీకి అనుగుణంగా కనిపించని బస్సులు
- గంటల పాటు నిరీక్షించిన భక్తులు
- క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల వద్ద కూడా సరైన ఏర్పాట్లు లేక ఇబ్బందులు

యాదగిరిగుట్ట: వేసవి సెలవులు ముగుస్తుండటంతో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు అధికంగా వస్తున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో గంటల తరబడి భక్తుల కొండ పైన, కొండ కింద బస్టాండ్‌లలో నిరీక్షించాల్సి వస్తోంది. ఆదివారం భక్తులు ఎక్కువగా రావడంతో చాలామంది కొండ కింద వాహనాలు పార్కింగ్ చేసి ఆర్టీసీ బస్సుల్లో కొండపైకి వెళ్లాల్సి వచ్చింది. సరిపడా బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కేవలం తొమ్మిది బస్సులే..

యాదగిరిగుట్ట పైకి, కొండ కిందకు ఆదివారం 9 బస్సులను మాత్రమే అధికారులు నడిపించారు. ఒక్కో బస్సులో 60 మంది ప్రయాణికులు ఎక్కాల్సి ఉండగా.. 100 మంది వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలా మంది భక్తులు సీట్ల కోసం పోటీపడడంతో పాటు ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణం చేయాల్సి వచ్చింది. సరిపడా బస్సులు లేకపోవడంతో అధికారుల తీరుపై భక్తులు అసహనం వ్యక్తం చేశారు. చాలామంది భక్తులు మెట్ల మార్గంలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

చిన్న పిల్లలు, తల్లుల ఇబ్బందులు..

ధర్మ దర్శనం, వీఐపీ దర్శనం క్యూలైన్లలో చిన్న పిల్లలతో వచ్చిన కుటుంబాలు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. క్యూలైన్లలో ఉక్కపోతతో పాటు క్యూకాంప్లెక్స్ నుంచి గోల్డ్ క్యూలైన్‌లోకి వచ్చే వరకు నీళ్లు లేకపోవడంతో చిన్నారులు తీవ్రంగా ఏడ్చారు. ఆలయాధికారులు రూ.150 క్యూలైన్, గోల్డ్ క్యూలైన్‌లోని భక్తులకు మాత్రమే తాగునీటిని సరఫరా చేశారు. పలువురు భక్తులు తమ పిల్లలతో నేరుగా తూర్పు రాజగోపురం ముందు ఉన్న మెయిన్ గేట్ ద్వారా ఆలయంలోకి వెళ్లేందుకు గాను ఎస్పీఎఫ్, హోంగార్డు సిబ్బందిని వేడుకున్నా తాళాలు తీయలేదు. ఆలయ అధికారులు వచ్చి జోక్యం చేసుకోవడంతో తాళాలు తీసి పంపించారు. చిన్నారులతో వచ్చిన పలువురు భక్తులు తూర్పు రాజగోపురం ముందు నుంచి, వైకుంఠద్వారం వద్ద స్వామిని మొక్కి దర్శనం చేసుకోకుండానే వెనక్కి వెళ్లిపోయారు.

ప్రసాద విక్రయశాలలోనూ అవస్థలే..

ప్రసాదం కౌంటర్ శివాలయం ముందు ఉండటంతో అక్కడికి మెట్లు దిగి వెళ్లి, టిక్కెట్ కొనుగోలు చేసి తిరిగి ప్రసాద విక్రయశాలలో గంటల తరబడి ప్రసాదం కోసం వేచి చూడాల్సి వచ్చిందని భక్తులు తెలిపారు. ప్రసాద విక్రయశాల పక్కకే కౌంటర్ పెట్టి ఉంటే బాగుండేదని పలువురు భక్తులు పేర్కొన్నారు. గంటల తరబడి దర్శనం క్యూలైన్లలో నిల్చొని, ప్రసాదం కోసం కూడా వేచి ఉన్నామని మహిళా భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

బస్సులు సరిగ్గా లేవు

యాదగిరీశుడిని దర్శించుకునేందుకు కుటుంబ సభ్యులతో వచ్చాను. కొండ కింద నుంచి ఆర్టీసీ బస్సులో కొండపైకి వచ్చాం. సుమారు నాలుగు గంటలు ధర్మ దర్శనం క్యూలైన్‌లో నిల్చొని స్వామిని దర్శించుకున్నాం. మధ్యాహ్నం 12గంటల తర్వాత కొండ పైన బస్టాండ్ వద్దకు వచ్చేసరికి బస్సులు లేవు. ఒకేసారి 4 బస్సులు వచ్చినప్పటికి భక్తులంతా గుంపులుగా వెళ్లి పోటీపడుతూ ఎక్కారు. సుమారు 45 నిమిషాల పాటు మరో బస్సు కోసం వేచి చూడాల్సి వచ్చింది. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాలి.

– శ్రీనివాస్, పాల్వంచ

ప్రసాదం కోసం వేచి చూశాం

కుటుంబ సభ్యులతో కలిసి రూ.150 టిక్కెట్ కొనుగోలు చేసి స్వామిని దర్శించుకున్నాం. అనంతరం లడ్డూ, పులిహోర ప్రసాదం కొనుగోలు కోసం వెళ్తే భారీ లైన్ ఉంది. వృద్ధులు, దివ్యాంగులకు ప్రసాదం సెక్షన్ వద్ద సరైన ఏర్పాట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డాం. అధికారులు ప్రసాద విక్రయశాల వద్ద దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తే బాగుంటుంది.

– విజయలక్ష్మి, సిద్దిపేట

కమ్యూనిస్టులపై కేంద్ర ప్రభుత్వం కుట్ర

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

సూర్యాపేట అర్బన్ : ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నించే కమ్యూనిస్టులను, ముఖ్యంగా మావోయిస్టులను లేకుండా చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన పార్టీ జిల్లా 4వ మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. చర్చలకు సిద్ధమని మావోయిస్టులు చెప్పినా కేంద్ర ప్రభుత్వ ఆపరేషన్ కగార్ పేరుతో విచక్షణారహితంగా కాల్పులు జరుపుతూ నరమేధం సృష్టిస్తోందన్నారు. 2026 మార్చిలోగా మావోయిస్టులను లేకుండా చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల నుంచి బయటపడడం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇబ్బందిగా మారిందన్నారు. దీనికి తోడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజల్లో విశ్వాసం పొందడానికి అనేక హామీలు ఇచ్చిందని, వాటిల్లో కొన్ని అమలు చేసినా చెప్పుకోలేకపోతున్నందున ప్రజల్లో అసమ్మతి వస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక వ్యూహం లేదని కమ్యూనిస్టులతో పాటు మేధావులు, విద్యావంతుల సలహాలు తీసుకొని ముందుకు వెళ్తే మంచి పాలన సాగించే అవకాశం ఉంటుందన్నారు. తాము వామపక్షాలుగా బీజేపీ, బీఆర్ఎస్‌ను వ్యతిరేకిస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీకి ఒక సఖ్యత ఏర్పడుతున్నట్లు కవిత మాటలతో మాకు అర్థమవుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలన్నారు. తాము ప్రజల వెంటే ఉండి సమస్యలపై పోరాడుతామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం ఒకరి కుట్రలతో అయ్యేవి కావని అది అంత సీరియస్‌గా తీసుకోవాల్సిన విషయం కాదన్నారు. అనంతరం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నీ వారి కార్యకర్తలకు, నాయకులకే ఇచ్చిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన తప్పులు చేయకుండా సంక్షేమ పథకాలు అందరికి అందేలా కృషి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లను ఇందిరమ్మ కమిటీలతో మంజూరు చేయడంతో అవకతవకలు జరిగినట్లు తెలిసిందన్నారు. ప్రభుత్వం నిష్పక్షపాతంగా పేదలకే సంక్షేమ పథకాలు ఇచ్చే ఆలోచన ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో లోపం జరుగుతుందన్నారు. కాబట్టి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించాలన్నారు. కమ్యూనిస్టులను అంతం చేయాలనుకునే ప్రభుత్వాలు మనుగడ సాగించలేవన్నారు. ప్రజల కోసం ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు. ఎల్లావుల రాములు, ఉత్సల నారాయణరెడ్డి, ఉపతల కోటమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్న చంద్రశేఖర్, ఉస్తెల సృజన, జిల్లా కార్యవర్గ సభ్యులు ధూళిపాల ధనంజయ నాయుడు, మేకల శ్రీనివాసరావు, బద్దం కృష్ణారెడ్డి, మండవ వెంకటేశ్వర్లు, ఎల్లంల యాదగిరి, పోకల వెంకటేశ్వర్లు, హనుమంతరావు, దేవర మల్లేశ్వరి, బూర వెంకటేశ్వర్లు, అనంతుల మల్లేశ్వరి, బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

● టార్పాలిన్ కవరే ఆధారం


భూదాన్‌పోచంపల్లి మండలంలోని భీమనపల్లి గ్రామానికి చెందిన కల్మూరి నర్సింహ పురాతన పెంకుల ఇంటిలో ఉంటున్నాడు. ఇటీవల కోతులు ఇంటి పైకప్పుపై పెంకులను ధ్వంసం చేశాయి. ఇల్లు కూడా శిథిలావస్థకు చేరడంతో వర్షానికి కురుస్తోంది. దీంతో వర్షాల నుంచి రక్షణ పొందడానికి నర్సింహ ఇంటిపై కప్పు చుట్టూ టార్పాలిన్ కవర్‌తో కప్పేశాడు. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నానని, తనకు ఇల్లు మంజూరు చేయాలని అతడు అధికారులకు కోరుతున్నాడు. - భూదాన్‌పోచంపల్లి

ఎమ్మెల్యే గోపినాథ్ మృతికి గుత్తా సంతాపం

నల్లగొండ టూటౌన్: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతి పట్ల శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. గోపినాథ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇద్దరికి గాయాలు

గరిడేపల్లి: రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండలం రాజారాం గ్రామానికి చెందిన చిన్నబోయిన కృష్ణయ్య తన కుమారుడు ఆకాష్‌తో కలిసి హుజూర్‌నగర్ నుంచి గరిడేపల్లి వైపునకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో కీతవారిగూడెం గ్రామ శివారులో రహదారిపై మొక్కలు తొలగిస్తున్న వాహనం అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో ద్విచక్ర వాహనం ఆ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణయ్య, ఆకాష్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108 వాహనంలో హుజూర్‌నగర్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు.

దుకాణ నిర్వాహకురాలిపై ఫైర్ కానిస్టేబుల్ దాడి

మోత్కూరు: బీర్లు ఇవ్వలేదనే కోపంతో కిరాణ దుకాణం నిర్వహిస్తున్న మహిళపై ఫైర్ కానిస్టేబుల్ దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మోత్కూరు మండలం అనాజిపురం గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. మోత్కూరు ఎస్ఐ, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. అనాజిపురం గ్రామానికి చెందిన ఇరుకుల్ల సంతోష లక్ష్మి తన ఇంట్లో కిరాణం దుకాణం నిర్వహిస్తోంది. శనివారం రాత్రి 10.30గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన మోత్కూరు ఫైర్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మలిపెద్ది మహేందర్‌రెడ్డి బీర్ల కోసం సంతోష లక్ష్మి ఇంటికి వెళ్లి తలుపులు కొట్టాడు. ఆమె తలుపులు తీయకపోవడంతో మహేందర్‌రెడ్డి బూతులు తిడుతూ తలుపులను కాళ్లతో తన్నడం మొదలుపెట్టాడు. దీంతో సంతోష లక్ష్మి ఎవరు మీరు అని అడగగా.. తాను కానిస్టేబుల్ మహేందర్‌రెడ్డిని అని, తనకు బీర్లు కావాలని డిమాండ్ చేశాడు. ఆమె తలుపులు తీసి బయటకు వచ్చి ఈ సమయంలో బీర్లు ఇవ్వడం కుదరదని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పడంతో మహేందర్‌రెడ్డి బూతు పురాణం అందుకున్నాడు. అంతటితో ఆగకుండా ఆమెపై దాడికి పాల్పడ్డాడు. అడ్డువచ్చిన ఆమె భర్తపై కూడా బండరాయితో దాడికి దిగాడు. దీంతో సంతోష లక్ష్మి డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఆదివారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి. నాగరాజు తెలిపారు.

పిడుగుపాటుతో వ్యక్తి మృతి


వెంకటయ్య (ఫైల్)

చింతపల్లి: పిడుగుపాటుకు గురై వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన చింతపల్లి మండలం వింజమూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వింజమూర్ గ్రామానికి చెందిన యాచారం పెద వెంకటయ్య(55) గొర్రెలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం గొర్రెలను మేపేందుకు తోలుకెళ్లాడు. సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. అదే సమయంలో వెంకటయ్య సమీపంలో పిడుగుపడడంతో స్పృహతప్పి పడిపోయాడు. గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు గమనించి వెంకటయ్యను చింతపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సన్నాల సాగుకు సై

- ఉమ్మడి జిల్లాలో పెరగనున్న సన్నరకం వరిసాగు
- మద్దతు ధర కంటే ఎక్కువగా చెల్లించి సన్నాలు కొనుగోలు చేస్తున్న మిల్లర్లు
- అధిక దిగుబడి రావడం, పంట కాలం తక్కువగా ఉండడంతో రైతుల మొగ్గు
- ఈ వానాకాలంలో ఆరు లక్షల ఎకరాల్లో సన్నాలు సాగయ్యే అవకాశం



నల్లగొండ అగ్రికల్చర్ : ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా రైతులు వరిలో సన్నాల సాగుకు మొగ్గు చూపుతున్నారు. దొడ్డురకం కంటే సన్నాలు పంట కాలపరిమితి 15 నుంచి 20 రోజులు తక్కువగా ఉండడం, దిగుబడి ఎక్కువగా వస్తుండడం, పచ్చిధాన్యాన్ని మిల్లర్లు మద్దతు ధరకంటే ఎక్కువకు కొనుగోలు చేయడం, ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయించే రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుండడంతో రైతులు సన్నరకాలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో గతేడాది కంటే సారి సన్నాల సాగు పెరగనుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది.

వానాకాలంలో 6 లక్షల ఎకరాలకు పెరిగే చాన్స్

వానాకాలంలో సన్నాల సాగు మరింత పెరిగి అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ అంచనాలు వేస్తుంది. ప్రస్తుత వానాకాలంలో నల్లగొండ జిల్లాలో 5,70,120 ఎకరాల్లో వరి సాగు కానున్నట్లు అంచనాలు వేయగా అందులో సన్నాలు 2.50 లక్షల ఎకరాల్లో సాగు కానున్నట్లు అంచనా వేసింది. సూర్యాపేట జిల్లాలో 4,35,790 ఎకరాల్లో సాగు కానుండగా.. సన్నాలు 2.25లక్షల ఎకరాల్లో సాగవుతాయని, యాదాద్రి భువనగిరి జిల్లాలో 3.12 లక్షల ఎకరాల్లో సాగు కానుండడగా.. సన్నాలు 1.24లక్ష ఎకరాల్లో సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. రానున్న రోజుల్లో సన్నాల సాగుకు రైతులు పెద్ద ఎత్తున ఆసక్తిని చూపే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

మద్దతు ధరకు మించి..

రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తున్న నేపథ్యంలో సన్నాలు సాగు చేసిన రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ వస్తోంది. మరోవైపు పచ్చి సన్న ధాన్యాన్ని రైస్ మిల్లర్లు మద్దతు ధరకు మించి కొనుగోలు చేస్తున్నారు. దొడ్డు రకం ధాన్యం అమ్ముకోవాలంటే రైతులు ఆరబెడ్డుకుని తీసుకువస్తేనే మద్దతు ధర రూ.2,330 చెల్లించారు. కానీ సన్న రకాల్లో పచ్చిధాన్యాన్ని అంతకు మించి ధరకు వస్తోంది. తూకం కూడా ఎక్కువ వస్తుండడంతో రైతులు సన్నాల సాగుకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. ప్రస్తుతం వానాకాలం నుంచి ప్రభుత్వం ధాన్యం మద్దతు ధరకు క్వింటాకు రూ.89 పెంచింది.

భారీగా దిగుబడి

రెండు మూడేళ్లుగా రైతులు ఎక్కువ సన్నాలు సాగు చేస్తున్నారు. ప్రైవేట్ కంపెనీలకు చెందిన జీనెక్స్ చిట్టిపొట్టి, కల్కి, జీనెక్స్ సాంబ, హెచ్ఎంటీలు, ప్రభుత్వ వెరైటీలైన బీపీటీ 5204, స్వర్ణ మసూరి, తెలంగాణ సోనా రకాలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యాసంగిలో సాగు చేశారు. సైరకాలు ఇతర రకాల కంటే 15 రోజులు ముందుగా పంట చేతికి రావడంతో పాటు తెగుళ్లను తట్టుకుని ఎకరాకు 50 బస్తాల కంటే ఎక్కువ ధాన్యం దిగుబడి వస్తుంది.

సన్నాలు మంచి దిగుబడి వచ్చింది



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యాసంగిలో సన్నాల సాగు పెరిగింది. సన్నాల రకాలైన జీనెక్స్ చిట్టిపొట్టి, కల్కి, బీపీటీ వంటి రకాల మంచి దిగుబడి వచ్చింది. ఎకరానికి 45 బస్తాల నుంచి 55 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. వానాకాలంలో కూడా సన్నాల సాగు 6 లక్షల ఎకరాలకు పెరిగే అవకాశం ఉంది.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ, నల్లగొండ

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి


కొత్తగూడెంలో మృతి చెందిన గేదెలు

మిర్యాలగూడ టౌన్: విద్యుదాఘాతంతో నాలుగు పాడి గేదెలు, రెండు లేగ దూడలు మృతి చెందాయి. ఈ ఘటన మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామంలో ఆదివారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం గ్రామానికి చెందిన కడెం తీరస్, నాలి లక్ష్మయ్య, పరంగి తిరుపతమ్మకు చెందిన నాలుగు పాడి గెదేలు, రెండు లేగ దూడలు రోజు మాదిరిగానే ఆదివారం కూడా మేతకు వెళ్లాయి. గ్రామ పరిధిలోని జొన్నలగడ్డ రాంరెడ్డి పొలం వద్ద విద్యుత్ వైరు తెగి కిందపడిపోవడంతో ఈ విద్యుత్ తీగకు గేదెలు, లేగ దూడలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాయి. మిర్యాలగూడ రూరల్ ట్రాన్స్‌కో ఏఈ అమర్‌సింగ్, మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సుమారు రూ.8లక్షలకు పైగా నష్టవాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దుబ్బతండాలో..

మిర్యాలగూడ మండలంలోని దుబ్బతండా గ్రామానికి చెందిన ధీరావత్ రాకేష్ ఆదివారం తన ఐదు పాడి గేదెలను మేతకు తీసుకెళ్లగా.. విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతిచెందాయి. వాటి విలువ రూ.6లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. గేదెల మృతికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్థానికులు అంటున్నారు.

టిప్పర్ ఢీకొని..

మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామానికి చెందిన సిరికొండ వెంటకమ్మకు చెందిన మూడు గేదెలు, రెండు లేగ దూడలు శనివారం మేతకు వెళ్లాయి. రాత్రి వరకు అవి ఇంటి చేరకపోవడంతో పరిసరాల ప్రాంతాల్లో వెతికి రాత్రి 11:30 గంటలకు గేదెలను తోలుకొని ఇంటికి వస్తుండగా.. ఆలగడప నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న టిప్పర్ గేదెలను ఢీకొట్టింది. దీంతో మూడు పాడి గేదెలు, రెండు లేగ దూడలు అక్కడికక్కడే మృతిచెందాయి. బాధితురాలు వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపారు.

పొలాలకు సేంద్రియ ఎరువు

- ట్రాక్టర్లతో తరలిస్తున్న రైతులు

పాడిపంట

హాలియా: రైతులు గతంలో పశువుల పేడ, మేకలు, గొర్రెల పెంట లాంటి సేంద్రియ ఎరువును నిల్వ చేసి పొలాల్లో కలియదున్నే వారు. ఈ మధ్యకాలంలో అలాంటి పనులను చేపట్టకపోవడంతో పంటలకు తెగుళ్ల బెడద పెరిగింది. దీంతో నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని ఆయకట్టు, నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో గతంలో చేసిన సాగు పద్ధతులను పాటిస్తూ రైతులు సేంద్రియ ఎరువును పొలాలకు, చెలకలకు తరలిస్తున్నారు. పాత రోజులను గుర్తుకు తెచ్చుకుంటున్న కొంతమంది రైతులు సేంద్రియ ఎరువును ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుండగా.. మరికొంత మంది రైతులు పశువుల ఎరువు కొనడానికి ఆసక్తి చూపుతున్నారు. రసాయన ఎరువుల కన్నా పశువుల ఎరువుకు ఎప్పుడు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. భూసారం పెరిగి పంటకు బలం వస్తుందని ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతులు పశువుల ఎరువును కొనుగోలు చేసి పంట పొలాల్లో చల్లి పంటల సాగుకు సిద్ధ చేస్తున్నారు. సీజన్ ప్రారంభానికి సమయం దగ్గర పడుతుండడంతో రైతులు దుక్కులు దున్నకం చేస్తున్నారు. పశువుల ఎరువుకు డిమాండ్ పెరగడం అందుకు తగ్గట్టు నిల్వలు లేక ధరలకు రెక్కలు వచ్చాయి. సాగర్ నియోజకవర్గంలోని ఆయకట్టు, నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో రైతులు వరి, పత్తి, బత్తాయి తదితర పంటలను సాగు చేస్తుంటారు. పశువుల ఎరువు వల్ల భూసారం పెరిగి పంటల దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని నమ్మకంతో ఎక్కువ మంది రైతులు పశువులు, గొర్రెలు, మేకలు పెంటను వాడుతుంటారు. ప్రతి సంవత్సరం పశువుల ఎరువు ధరలు గణనీయంగా పెరుగుతోంది. గత సంవత్సరం గేదెల పేడ ఎరువు ట్రాక్టర్ లోడ్‌కు ధర రూ.8వేలు ఉండగా ఈ సంవత్సరం రూ.12వేలకు పెరిగింది. మేకలు, గొర్రెల పెంట లారీ లోడ్‌కు రూ.30వేల నుంచి రూ.38వేలకు చేరుకుంది.


హాలియాలో ట్రాక్టర్‌తో తరలిస్తున్న ఎరువు

దిగుబడి ఎక్కువగా వస్తుంది



రసాయన ఎరువుల కన్నా పశువుల ఎరువు వల్ల భూసారం పెరిగి పంట దిగుబడి ఎక్కువగా వస్తుంది. మాకు గేదెల ఫాం, గొర్రెల ఫాం ఉన్నాయి. వీటి నుంచి వచ్చే పేడను ఒక చోటకు చేర్చి దానిని కుళ్లబెడతాం. అది ఎరువుగా మారిన తర్వాత ట్రాక్టర్ ద్వారా పొలాలకు తరలిస్తాం. ఇలా గత 11 సంవత్సరాలుగా మా పొలంలో పశువుల ఎరువును వాడడుతుండంతో పంటకు ఎలాంటి తెగుళ్లు సోకకుండా దిగుబడి కూడా పెరిగింది.

– మర్ల అనిల్‌రెడ్డి, రైతు, త్రిపురారం

సారవంతంగా మారనున్న భూమి..

రసాయనిక ఎరువులతో భూమిలో ఉన్న సారం తగ్గడంతో పాటు భూమిలో తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు సమావేశాలు, సభలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ దిగుబడులను పెంచడం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో రసాయనిక ఎరువులను ఎక్కువగా వినియోగిస్తున్నారు. కాగా ప్రస్తుతం రైతులు సేంద్రియ ఎరువుల వాడకం వైపు మొగ్గు చూపుతున్నారు. సేంద్రియ ఎరువులు వాడకం వలన భూమి సారవంతంగా తయారవుతుంది. దీంతో పంట మొక్కలు ఏపుగా పెరగడానికి ఆస్కారం ఉంది. పంటను తెగుళ్లు ఆశించే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. రైతులు రసాయనిక ఎరువుల భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా సేంద్రియ ఎరువు వైపు ఆసక్తి చూపి పొలాలకు తరలిస్తున్నారు.